సాక్షి
ఆదిలాబాద్

శనివారం । 29 । మార్చి । 2025



గ్రామాల్లో సౌర వెలుగులు
గ్రామాల్లో సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు కేంద్రం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో రెండింటిని మోడల్ గ్రామాలుగా ఎంపిక చేశారు. 10లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శని : 6:25	ఆది : 4:56

గరిష్టం/కనిష్టం
40.0/24.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

వైద్యశాఖలో.. అవినీతి జలగ!

- ఏసీబీకి చిక్కిన మాస్‌మీడియా అధికారి
- రూ.30వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత
- జిల్లాలో పెరిగిన లంచావతారులు
- ఈ ఏడాది ఇప్పటి వరకు ముగ్గురు ట్రాప్





ఏసీబీకి పట్టుబడ్డ మాస్ మీడియా అధికారి రవిశంకర్

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ కార్యాలయాల్లో కొంత మంది ఉద్యోగులు, అధికారులు లంచావతారం ఎత్తుతున్నారు. చెయ్యి తడపనిదే ఏ పని చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు ముగ్గురు ఏసీబీకి చిక్కారు. సర్కారు కొలువులో ఉండి వచ్చే జీతం సరిపోదన్నట్టుగా అక్రమ మార్గంలో లంచం తీసుకుంటూ బాధితులను వేధిస్తున్నారు. కొంతమంది అవినీతి నిరోధక శాఖకు పట్టుబడుతుండగా, చాలామంది గుట్టుగా తమ పని కానిచ్చేసుకుంటున్నారు. బాధితులు పలువురు ఏసీబీని ఆశ్రయించి వారి భరతం పట్టేలా చూస్తుండగా, చాలా మంది అవగాహన లేమితో చేసేది లేక లంచం అందించి తమ పనులు చేయించుకుంటున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు మూడు కేసులు నమోదయ్యాయి. ఉట్నూర్‌లో వెటర్నరి అధికారి రమేశ్ రాథోడ్, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఈడబ్ల్యూఐడీసీ డీఈఈ జిన్నవార్ శంకర్ ఇటీవల పట్టుబడిన విషయం తెలిసిందే. తాజాగా శుక్రవారం వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న మాస్ మీడియా అధికారి రవిశంకర్ రూ.30వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కాడు.

అసలేమి జరిగిందంటే..

గుడిహత్నూర్ మండలంలోని మన్నూర్ గ్రామంలో ఓ ఆర్‌ఎంపీ ఓ మహిళకు గర్భస్రావం కోసం మాత్రలు ఇవ్వడంతో ఆమెకు అబార్షన్ అయ్యింది. చనిపోయిన శిశువును సదరు మహిళ వాగు సమీపంలో పడేసింది. ఈ విషయం గ్రామస్తులకు తెలియడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. విచారణ జరిపిన పోలీసులు ఆర్‌ఎంపీపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అయితే ఇటీవల వైద్యారోగ్య శాఖ జిల్లా మాస్ మీడియా అధికారితో పాటు మరికొంత మంది అధికారులు ఆర్‌ఎంపీ నిర్వహిస్తున్న క్లినిక్‌ను సీజ్ చేశారు. ఈ క్రమంలో సదరు అధికారి పక్కనే మెడికల్ షాపు నిర్వహిస్తున్న మన్నూర్ గ్రామానికి చెందిన షాపు యజమానిని భయభ్రాంతులకు గురిచేశాడు. మెడికల్ షాపు నుంచే మాత్ర ఇచ్చావని, నీ పేరు చేర్చితే కేసు నమోదవుతుందని పేర్కొన్నాడు. విచారణలో పేరు రాయకుండా ఉండాలంటే రూ.30వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. రెండుమూడు సార్లు ఫోన్ కూడా చేసినట్లు బాధితుడు పేర్కొన్నాడు. ఈ క్రమంలో ఆయన ఏసీబీ అధికారులను గురువారం ఆశ్రయించాడు. 24 గంటల్లోపే అధికారులు అవినీతి అధికారి భరతం పట్టారు. శుక్రవారం ఉదయం 11గంటల సమయంలో మెడికల్ షాపు యజమాని డబ్బులు ఇస్తానని చెప్పడంతో జిల్లా కేంద్రంలోని వైద్యారోగ్య శాఖ కార్యాలయం నుంచి ఆవరణలోకి వచ్చాడు. చెట్టు కింద రూ.30వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కాగా సినీ ఫక్కీలో ఏసీబీ డీఎస్పీ లుంగీ కట్టుకొని గుర్తుపట్టకుండా కార్యాలయానికి వచ్చారు. ఆయనతో పాటు మరో ఇద్దరు సీఐలు కిరణ్ రెడ్డి, స్వామిలు దాడి జరిపారు. నోట్లపై రసాయనం చల్లిన వాటిని పరీక్షలు చేయగా, పాజిటివ్ వచ్చిందని ఏసీబీ అధికారులు వెల్లడించారు. పట్టుబడిన అధికారిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు. కాగా మాస్ మీడియా అధికారి ఏసీబీకి చిక్కడంతో కార్యాలయంలోని ఆ శాఖలో పనిచేసే ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయానికి ముందుగానే గదులకు తాళం వేసి ఇంటిముఖం పట్టారు. అధికారులెవరూ కనిపించలేదు.

తనిఖీ చేసిన మరుసటి రోజే..

బోథ్: బోథ్, సొనాల మండలాల్లోని పలు ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్ కేంద్రాలను వైద్యారోగ్య శాఖలో మాస్ మీడియా అధికారిగా విధులు నిర్వహిస్తున్న రవిశంకర్ ఈ నెల 27న తనిఖీ చేశారు. నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్న బోథ్‌లో ఓ క్లినిక్, సొనాలలో మరో క్లినిక్‌ను సీజ్ చేశారు. ఈ క్రమంలో మరుసటి రోజే ఆదిలాబాద్‌లో లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడం గమనార్హం.

నల్లగొండలో పనిచేసే సమయంలోనూ ఆరోపణలు..

కాగా, పట్టుబడిన సదరు అధికారి నల్లగొండలో పని చేసిన రోజుల్లోనూ అనేక ఆరోపణలు వచ్చాయి. స్కాన్‌సెంటర్ల విషయంలోనూ అర్హతలు లేవంటూ రూ.లక్షల్లో డిమాండ్ చేశాడని ప్రచారం జరిగింది. ఇక ఏరియాల వారీగా నెలనెలా ఆస్పత్రులు, ల్యాబ్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లలో తనిఖీ పేరిట వసూళ్లకు పాల్పడే వాడని గగ్గోలుపెట్టారు. సదరు అధికారి ఆగడాలు భరించలేక నల్లగొండలోని గైనకాలజిస్టులు అప్పటి కలెక్టర్, ఇప్పటి కమిషనర్ కర్ణన్‌కు ఫిర్యాదు చేశారు. స్కాన్‌సెంటర్లు, అబార్షన్ల పేరిట ఇబ్బందులకు గురిచేశారని వాపోయారు. దీంతో డీఎంహెచ్‌వోతో విచారణ జరిపి డీహెచ్‌కు సరెండర్ చేశారు. తర్వాత చార్జీ మెమోతో పనిష్‌మెంట్‌పై ఆదిలాబాద్‌కు పోస్టింగ్ ఇచ్చారు.

లంచం అడిగితే ఏసీబీని ఆశ్రయించండి..

ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు, అధికారులు లంచం అడిగితే టోల్‌ఫ్రీ నంబర్ 1064కు, డీఎస్పీ నంబర్ 91543 88963, సీఐలను 91543 88964, 91543 88965 నంబర్లపై సంప్రదించవచ్చు. ఏసీబీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా అక్రమార్కుల భరతం పడతారు. బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతారు. సమాచారం అందించిన 24 గంటల్లోనే దాడులు నిర్వహిస్తామని ఏసీబీ అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఆ శాఖ ఉద్యోగిని పట్టిస్తే తమ పని నిలిచిపోతుందని భయపడాల్సిన అవసరం లేదు. ఆ తర్వాత ఇన్‌చార్జి అధికారి ద్వారా ఏసీబీ అధికారులు త్వరగా బాధితుల పనిని దగ్గరుండి చేయిస్తారు. వేధింపులు రాకుండా చూస్తారు. అవినీతి అధికారులను పట్టించే సమయంలో ఇచ్చిన డబ్బులను ప్రభుత్వం రెండు నెలల్లో చెక్ రూపంలో తిరిగి అందజేస్తుంది. పట్టుబడ్డ ఉద్యోగులు 40 నుంచి 50 రోజుల పాటు జైలు జీవితం గడపాల్సి ఉంటుంది. రెండేళ్ల వరకు ఉద్యోగంలో చేరే అవకాశం ఉండదు. 8 నుంచి పదేళ్లలో కేసు ట్రయల్‌కు వస్తుంది. దాదాపు 90శాతం కేసులు రుజువవుతున్నాయి.

న్యూస్‌రీల్

సర్వర్ డౌన్!



సర్వర్ డౌన్‌తో ఖాళీగా కూర్చున్న ఉద్యోగులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. సంబంధిత వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో తరచూ సర్వర్ డౌన్ అవుతోంది. మూడు రోజులుగా ఇదే పరిస్థితి ఉండటంతో సర్టిఫికెట్లు జారీ కావడం లేదు. దీంతో ఆ విభాగంలో పనిచేసే ఉద్యోగులు ఖాళీగా కూర్చోవాల్సి వస్తోంది. మరోవైపు ఆయా సర్టిఫికెట్ల కోసం కార్యాలయానికి వస్తున్న దరఖాస్తుదారులు సర్వర్ పనిచేస్తుందనే ఆశతో గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. ఎంతకి వెబ్‌సైట్ తెరుచుకోకపోవడంతో చేసేది లేక నిరాశతో వెనుదిరుగుతున్నారు. దీనిపై మున్సిపల్ అధికారులను సంప్రదించగా రాష్ట్రస్థాయి సర్వర్‌లోనే సమస్య ఉందని, ఫలితంగానే సర్వర్ డౌన్ అవుతుందని చెబుతున్నారు. సమస్యను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నామని పేర్కొంటున్నారు. అక్కడ సమస్య పరిష్కారమైతే తప్ప సర్టిఫికెట్ల జారీ ఉండదని స్పష్టం చేస్తున్నారు.

రెవెన్యూ శాఖలోనూ..

రెవెన్యూ శాఖలోనూ సర్వర్ సమస్య తలెత్తింది. రాజీవ్ యువవికాసం పథకం అమలు నేపథ్యంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఈనేపథ్యంలో సర్వర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తి సేవలకు అంతరాయం ఏర్పడింది. గురువారం మధ్య మధ్యలో సమస్య ఎదురుకాగా, శుక్రవారం పూర్తిగా సేవలకు బ్రేక్ పడింది. దీంతో దరఖాస్తుదారులు ఇబ్బందులకు గురయ్యారు.

పంచాంగ పుస్తకావిష్కరణ

కైలాస్‌నగర్: సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ముద్రించిన ఉగాది పంచాంగ పుస్తకాలను కలెక్టర్ రాజర్షి షా తన చాంబర్‌లో ఆవిష్కరించారు. సమితి సభ్యులు ఆయనను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం తొలి పుస్తకాన్ని ఎస్పీ అఖిల్ మహాజన్‌ను ఆయన కార్యాలయంలో కలిసి అందజేశారు. సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రీ మాట్లాడుతూ.. ఉగాది రోజున పట్టణంలోని గోపాలకృష్ణ మఠంలో ఈ పుస్తకాలను పంపిణీ చేస్తామన్నారు. అలాగే ఉగాది పచ్చడితో పాటు గుడాలు కూడా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రజలంతా ఈ వేడుకల్లో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు వామన్, నర్సిములు, రవీందర్, సూర్యకాంత్ తదితరులు పాల్గొన్నారు.

శనగ కొనుగోళ్లకు తాత్కాలిక బ్రేక్

బోథ్: మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో శనగ కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి గోలి స్వామి ప్రకటనలోతెలిపారు. ఉగాది, రంజాన్ కారణంగా శనివారం నుంచి ఏప్రిల్ 1వరకు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. 2న తిరిగి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. రైతులు విషయాన్ని గమనించాలని కోరారు.

క్షయ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: జిల్లాను క్షయ రహితంగా మార్చేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రపంచ క్షయ నియంత్రణ దినోత్సవం పురస్కరించుకుని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. టీబీ వైరస్‌ను కనిపెట్టిన ప్రొఫెసర్ రాబర్ట్ కోచ్ చిత్రపటానికి పూలమాల వేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్షయ నియంత్రణలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన వంద రోజుల కార్యక్రమం విజయవంతం చేయడంపై సిబ్బందిని అభినందించారు. అనంతరం వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోస్టర్ ఆవిష్కరించారు. క్షయ నిర్మూలించేందుకు కృషి చేస్తానని తెలిపే బ్యానర్‌పై స్వయంగా కలెక్టర్ సంతకం చేశారు. ఇందులో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, జిల్లా క్షయ నియంత్రణాధికారి సుమలత, వైద్యులుపాల్గొన్నారు.

కలెక్టరేట్ ఏవోకు సన్మానం

ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్న కలెక్టరేట్ ఏవో బి.రాంరెడ్డి దంపతులను కలెక్టర్ రాజర్షి షా ఘనంగా సన్మానించారు. పట్టణంలోని రెవెన్యూగార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గజమాల, శాలువతో సత్కరించి వీడ్కోలు తెలిపారు.

కలెక్టర్ తీరుపై దళిత సంఘాల నిరసన

కైలాస్‌నగర్: మహనీయుల జయంతి కార్యక్రమాల ఏర్పాట్లపై సమావేశం ఉందని ఆహ్వానించి అధికారులు రాకపోవడంపై దళిత సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరం వద్ద నిరసన తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై సమావేశం ఉంటుందని దళితాభివృద్ధి శాఖ కార్యాలయం నుంచి దళిత సంఘాలకు సమాచారం అందించారు. దీంతో వారంతా అక్కడికి చేరుకున్నారు. సాయంత్రం 4.30 గంటల వరకు వేచి చూసినా డీఎస్సీడీవో తప్పా అధికారులెవరు హాజరు కాలేదు. కలెక్టర్ తమను పిలిపించి గైర్హాజరు కాకపోవడం సరికాదని ఆయా సంఘాల నాయకులు అన్నారు. ఇందులో నాయకులు స్వామి, ప్రజ్ఞకుమార్, మల్లన్న, విఠల్, దయవాశీల హుక్కే, రమాకాంత్, సందీప్, రాజన్న, తదితరులున్నారు.

‘సీసీఐ’ హామీని విస్మరించిన కేంద్రం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



ఫ్యాక్టరీ గేట్ వద్ద అభివాదం చేస్తున్న జాన్‌వెస్లీ, నాయకులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ సీసీఐ ఫ్యాక్టరీని పునఃప్రారంభిస్తామని హామీ ఇచ్చిన కేంద్రప్రభుత్వం అధికారంలోకి రాగానే విస్మరించి, ఆ భూములను వెంచర్లుగా మార్చి రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు అప్పగించే కుట్ర చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఆరోపించారు. శుక్రవారం ఆయన సీసీఐ సాధన కమిటీ నాయకులతో కలిసి మూతపడ్డ ఫ్యాక్టరీని సందర్శించారు. పోలీసులు అడ్డుకోగా మెయిన్‌గేట్ వరకు వెళ్లి పరిసరాలను పరిశీలించారు. అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు అఖిలపక్ష నాయకులతో బైక్ ర్యాలీ చేపట్టారు. కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే దీక్షలకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు కేంద్రమంత్రులు అమిత్ షా, హన్స్‌రాజ్ గంగారాంలు ఫ్యాక్టరీని పునఃప్రారంభిస్తామని హామీలిచ్చారని గుర్తు చేశారు. అలాగే స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు కూడా తమను గెలిపిస్తే సీసీఐని తెరిపిస్తామని హామీలిచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. వారికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఫ్యాక్టరీ తెరిపించేందుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఫ్యాక్టరీ మూతపడడంతో దాదాపు పదివేల మంది కార్మికులు, ఉద్యోగులు రోడ్డున పడ్డారని పేర్కొన్నారు. వందేళ్లకు సరిపడా ముడిసరుకున్నా ఫ్యాక్టరీని కేంద్రం ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ కుట్రలను తిప్పికొట్టేందుకు అన్ని రాజకీయ పార్టీలతో పాటు సామాజిక, ప్రజా, కుల సంఘాలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఇందులో సీసీఐ సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేశ్, కోకన్వీనర్లు నారాయణ, ఈశ్వర్ దాస్, దత్తాత్రి, రాఘవులు, కిరణ్, పట్టణ అధ్యక్షుడు అజయ్, రమేశ్, ప్రేమల, శివకుమార్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద భారీ బందోబస్తు

సీసీఐ సాధన కమిటీ బహిరంగ సభ, బీజేపీ రైతు సత్యాగ్రహ దీక్ష నేపథ్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఐదుగురు సీఐలు, పలువురు ఎస్సైలతో పాటు సాయుధ బలగాలతో బందోబస్తు నిర్వహించారు. ఆందోళనకారులు కలెక్టరేట్‌లోకి వెళ్లకుండా చర్యలు చేపట్టారు. రెండు గేట్లను బారికేడ్లతో మూసివేశారు. ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి ఈ రెండు కార్యక్రమాలు ముగిసేంత వరకు అక్కడే ఉండి పర్యవేక్షించారు. ముందస్తు చర్యల్లో భాగంగా వజ్ర వాహనాన్ని కూడా అందుబాటులో ఉంచారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట బీజేపీ రైతు సత్యాగ్రహ దీక్ష



నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు

కైలాస్‌నగర్: రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తు శుక్రవారం బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట రైతు సత్యాగ్రహదీక్ష చేపట్టారు. జొన్నకర్రలను పట్టుకుని ర్యాలీగా వచ్చిన రైతులు, బీజేపీ నాయకులు అక్కడే బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ మాట్లాడుతూ, రైతు రుణమాఫీ, రైతు భరోసా పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా రైతులను మోసగిస్తోందని ఆరోపించారు. రైతుల పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఓ సారి మంత్రిగా పనిచేసిన జోగు రామన్న కొరటా–చనాఖా ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయించలేదని ప్రశ్నించారు. నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించిన ఆయనకు సీసీఐ గురించి మాట్లాడే అర్హత ఎక్కడిదని మండిపడ్డారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు దయాకర్, పాయల్ శరత్, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, కరుణాకర్‌రెడ్డి, కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కుర్చీకా..‘పంచాయతీ’!

- బదిలీ అయినా రిలీవ్ కాని అధికారి
- విధుల్లో చేరని కొత్త ఆఫీసర్
- ఇప్పటికే నెల దాటిన వైనం..
- హాట్‌టాపిక్‌గా ‘డీపీవో’ వ్యవహారం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా పంచాయతీ శాఖలో కుర్చీపై పేచి నెలకొంది. జిల్లా పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న ఎస్.శ్రీలతను బదిలీ చేసిన ప్రభుత్వం ఆమె స్థానంలో నిర్మల్ డీఎల్‌పీవోగా పనిచేస్తున్న జి. రమేశ్‌ను నియమించింది. ఈ ఉత్తర్వులు వచ్చి నెల దాటినా కొత్త అధికారి విధుల్లో చేరకపోవడం, ప్రస్తుత అధికారి విధుల నుంచి రిలీవ్ కాకపోవడంపై సొంత శాఖతో పాటు అధికారిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. విధుల్లో చేరేందుకు నిర్మల్‌లో రిలీవై వచ్చిన అధికారిని చేర్చుకోకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. డీపీవో బదిలీ వ్యవహారంలో అసలు ఏం జరుగుతుందనే దానిపై పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది.

ఏం జరిగిందటే..

గ్రామ పంచాయతీ ఎన్నికల కసరత్తు ముమ్మరమైన నేపథ్యంలో ప్రభుత్వం పలువురు జిల్లా పంచాయతీ అధికారులను బదిలీ చేసింది. అందులో భాగంగా ఆదిలాబాద్ డీపీవోగా పనిచేస్తున్న ఎస్.శ్రీలతను బదిలీ చేసిన ప్రభుత్వం పంచాయతీ రాజ్ కమిషనర్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని సూచించింది. ఆమె స్థానంలో నిర్మల్ డీఎల్‌పీవోగా పనిచేస్తున్న రమేశ్‌ను నియమిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఫిబ్రవరి 14న ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ఆ ఉత్తర్వుల్లో కొన్ని సవరణలు చేసింది. నిర్మల్ డీఎల్‌పీవోగా ఉన్న రమేశ్‌ను రీడిప్లాయిమెంట్ కింద పంచాయతీ అధికారిగా నియమిస్తూ మరోసారి ఫిబ్రవరి 25న ఆ శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో ఆయన గత నెల 27న నిర్మల్‌లో డీఎల్‌పీవోగా రిలీవై జిల్లాకు వచ్చారు. విధుల్లో చేరేందుకోసం కలెక్టర్‌ను మర్యాదపూర్వంగా కలిశారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఆగాలని కలెక్టర్ సదరు అధికారికి సూచించినట్లు సమాచారం.



పీఆర్ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వు ప్రతి

నెల రోజులుగా ఖాళీగానే..

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఈ నెల 8వ తేదీతో ముగిసింది. అయినప్పటికీ రమేశ్‌ను జిల్లాలో విధుల్లో చేర్చుకోలేదు. అటు నిర్మల్‌లో డీఎల్‌పీవోగా రిలీవ్ కావడం, ఇటు డీపీవోగా బాధ్యతలు చేపట్టే అవకాశం లేకపోవడంతో ఆయన నెల రోజులుగా ఏ పోస్టు లేకుండా ఖాళీగానే ఉంటున్నారు. అయితే సదరు అధికారిని విధుల్లో చేర్చుకునేందుకు ఉన్నతాధికారి ఆసక్తి చూపడం లేదనే ప్రచారం సాగుతుంది. ఈ క్రమంలో బదిలీ అయినా రిలీవ్ కాకుండా పాత డీపీవోనే ఆ శాఖ పాలన వ్యవహారాలను పర్యవేక్షిస్తుండడం గమనార్హం. ఇటీవల నిర్వహించిన ‘క్షయ ముక్త్ భారత్’ కార్యక్రమ శిక్షణకు సైతం సదరు అధికారే వెళ్లి వచ్చారు. అయితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాగా ఉన్న సమయంలో పంచాయతీ కార్యాలయ ఏవోగా పనిచేసిన రమేశ్‌కు జిల్లాపై పూర్తి అవగాహనతో పాటు పాలనా వ్యవహారాలపై పట్టుంది. ఈ క్రమంలో ఆ శాఖలో పనిచేసే ఓ అధికారి ఆయన విధుల్లో చేరకుండా ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించారనే ప్రచారం వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో అసలు డీపీవో బదిలీ అయినట్లా.. లేక ఆగినట్లా అనే దానిపై పంచాయతీ కార్యదర్శుల్లో చర్చ సాగుతోంది.

ఇదే విషయమై పాత డీపీవో, నిర్మల్ నుంచి బదిలీపై వచ్చిన అధికారిని ‘సాక్షి’ సంప్రదించగా.. ప్రభుత్వం నుంచి మళ్లీ ఉత్తర్వులు వచ్చే వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి సీతక్క బిజీగా ఉండటంతో ఉత్తర్వుల జారీలో ఆలస్యం అయిందని, సమావేశాలు ముగియడంతో త్వరలోనే జారీ అయ్యే అవకాశమున్నట్లుగా పేర్కొన్నారు.

కొత్త ఎమ్మెల్సీలొస్తున్నారు

- రేపటి నుంచి పదవిలోకి..
- ఇద్దరూ బీజేపీ సభ్యులే..
- జిల్లా అభివృద్ధికి పాటుపడేనా?



పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి



టీచర్స్ ఎమ్మెల్సీ కొమురయ్య

సాక్షి, ఆదిలాబాద్: కొత్త ఎమ్మెల్సీలు సి.అంజిరెడ్డి, మల్క కొమురయ్యల శాసన మండలి పదవీకాలం ఆదివారం నుంచి మొదలు కానుంది. ఇద్దరూ బీజేపీ నుంచి ఎంపికైన సభ్యులే. ఆరేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఎమ్మెల్సీలకు కేటాయించే నియోజకవర్గ అభివృద్ధి నిధుల పరంగా జిల్లాకు కూడా వెచ్చించి ఈప్రాంత అభివృద్ధికి దోహదపడాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది

కాషాయం పార్టీ ప్రభంజనం..

కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల, టీచర్స్ ఎన్నికల్లో కాషాయం పార్టీ ప్రభంజనం చూపించిన విషయం తెలిసిందే. పట్టభద్రుల ఎమ్మెల్సీ నుంచి సి.అంజిరెడ్డి, టీచర్స్ నుంచి కొమురయ్య ఇటీవల గెలిచారు.

ముగిసిన పదవీకాలం..

పట్టభద్రుల ఎమ్మెల్సీగా వ్యవహరించిన కాంగ్రెస్‌కు చెందిన టి.జీవన్ రెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీగా వ్యవహరించిన రఘోత్తంరెడ్డిల పదవీ కాలం శనివారంతో ముగియనుంది. 2019 నుంచి వీరు ఎమ్మెల్సీలుగా కొనసాగారు. తాజాగా ముగిసిన ఎన్నికల్లో జీవన్ రెడ్డి పోటీ చేయలేదు. గత ఎన్నికల్లో పీఆర్టీయూ నుంచి బరిలో నిలిచిన రఘోత్తంరెడ్డి సిట్టింగ్ ఎమ్మెల్సీ అయినా ఈసారి ఆయనకు పీఆర్టీయూ నుంచి అభ్యర్థిత్వం దక్కలేదు. ఇతర సంఘాల మద్దతుతో బరిలో నిలిచినా ఓటమి పాలయ్యారు.

బాధితులతో గౌరవంగా వ్యవహరించాలి

- ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: ప్రతీపోలీస్‌స్టేషన్‌లో రిసెప్షన్ సెంటర్ల పాత్ర కీలకమైందని, ఫిర్యాదు చేసేందుకు వచ్చే బాధితులతో గౌరవంగా వ్యవహరించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్ల రిసెప్షనిస్టులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో గౌరవంగా వ్యవహరిస్తూ బాధితులకు సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలన్నారు. జిల్లాలోని ప్రతీ గ్రామానికి విలేజ్ పోలీస్ ఆఫీసర్ ఉండేలా చూడాలన్నారు. ఫిర్యాదులు స్వీకరించిన వెంటనే స్టేషన్ ఇన్‌చార్జి సంబంధిత విలేజ్ పోలీస్ ఆఫీసర్‌కు అప్పగించి సరైన దర్యాప్తు కొనసాగించేలా చూడాలన్నారు. సంఘటన స్థలంలో ఉన్న సాక్షుల వాంగ్మూలం నమోదు చేసి వారి సంతకాలతో కూడిన రిపోర్టును రిసెప్షనిస్టుకు అందజేయాలన్నారు. ఒకవేళ రాజీ పొందితే రాజీ పత్రంపై ఇరు వర్గాలు, సాక్షుల సంతకాలతో కూడిన పత్రాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంక్వయిరీ అధికారి తన దర్యాప్తుతో పాటు సెల్ఫీతో కూడిన ఛాయాచిత్రాన్ని రిపోర్టులో పొందుపరచాలని తెలిపారు. ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలన్నారు. నెలలో ప్రతీవారం సీఐ స్థాయి అధికారులు తమ స్టేషన్లలో జరిగే రిసెప్షన్ వర్టికల్‌పై ప్రత్యేక చొరవ తీసుకొని సమీక్షించాలని తెలిపారు. ఇందులో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, డీసీఆర్బీ సీఐ పాండేరావు, సిబ్బంది పాల్గొన్నారు.



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ

పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఇఫ్తార్

ఆదిలాబాద్‌టౌన్: పోలీస్ సిబ్బంది సోదరాభావంతో ఐకమత్యంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శాంతి సామరస్యాలతో సంతోషకర జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ముస్లిం పోలీస్ సిబ్బందికి ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఉపవాస దీక్షలు విరమించారు. ఇందులో డీఎస్పీలు శ్రీనివాస్, జీవన్‌రెడ్డి, హసీబుల్లా, పట్టణ సీఐలు, రిజర్వ్‌ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోత లేకుండా శస్త్రచికిత్స

ఆదిలాబాద్‌టౌన్: కిడ్నీ స్టోన్‌తో బాధపడుతున్న వృద్ధురాలు (90)కి ఎలాంటి కోతలు లేకుండా అత్యాధునిక టెక్నాలజీతో విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించినట్లు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. జైనథ్ మండల కేంద్రానికి చెందిన పింటుబాయి అనే 90ఏళ్ల వృద్ధురాలు రిమ్స్ యూరాలజీ విభాగంలో మంగళవారం అడ్మిట్ అయ్యారు. డాక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో అనస్తీషియా వైద్యురాలు హిమనీ రోగి శరీరంపై ఎలాంటి కోతలు లేకుండా లేజర్ టెక్నాలజీని ఉపయోగించి స్టోన్స్‌ను తొలగించినట్లు పేర్కొన్నారు. దీంతో పలువురు వైద్యులు, సిబ్బంది, సూపర్‌స్పెషాలిటీ పర్యవేక్షకుడు డాక్టర్ సత్యనారాయణలను అభినందించారు. అలాగే వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వైద్యులను అభినందించారు.

యోగా పోటీల రిఫరీగా వినోద్

జన్నారం: జాతీయస్థాయి యోగా రిఫరీ డిప్లొమా పోటీలలో పరీక్ష రాసి, ఉత్తీర్ణత సాధించి యోగా రిఫరీగా జన్నారం మండలం మహ్మదబాద్‌కు చెందిన దుర్గం వినోద్ ఎంపిక య్యాడు. ఈనెల 23న నిర్వహించిన ఆన్‌లైన్ యోగా పరీక్ష రాసి ప్రతిభ కనబరిచినట్లు తెలంగాణ యోగా అసోసియేషన్ కార్యదర్శి సిద్దారెడ్డి, మాజీ కార్యదర్శి మనోహర్‌లు తెలిపారు. ఈ సందర్భంగా యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ అశోక్ అగర్వాల్ చేతుల ఉత్తీర్ణత పత్రం అందుకున్నాడు.

సెలవు దినాల్లోనూ సేవా కేంద్రాలు

ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సౌకర్యార్థం ఈనెల 30, 31న వినియోగదారుల సేవా కేంద్రాలను తెరిచి ఉంచనున్నట్లు బీఎస్ఎన్ఎల్ నిజామాబాద్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు రోజులు అయినప్పటికీ వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు వెసులుబాటు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లా వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు.

పశువుల వాహనం పట్టివేత

పెంచికల్‌పేట్: అక్రమంగా పశువులను తరలిస్తున్న బొలెరో వాహనాన్ని, పశువులను స్వాధీనం చేసుకున్నట్లు పెంచికల్‌పేట్ ఎస్సై కొమురయ్య శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూర్ మండలంలోని మర్థిడి గ్రామం నుంచి హుస్నాబాద్‌కు పశువులను తరలిస్తున్నారనే సమాచారంతో ఎల్కపల్లి పెట్రోల్ బంక్ వద్ద ఉదయం 5 గంటలకు తనిఖీలు నిర్వహించాం. బొలెరో వాహనంలో తరలిస్తున్న 5 ఎద్దులు, రెండు దున్నపోతులను స్వాధీనం చేసుకున్నామన్నారు. కరీంనగర్‌కు చెందిన జాఫర్, మహ్మద్ రఫీ, కుకుడ గ్రామానికి చెందిన శ్రీశైలంపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గంజాయి తాగిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: గంజాయి తాగిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపా రు. ఆదిలాబాద్ పట్టణంలోని నీలానగర్‌కు చెందిన బాయసాహెబ్ అనే వ్యక్తి గంజాయికి అలవాటు పడినట్లు పేర్కొన్నారు. మావల పోలీస్‌స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో గంజాయి తాగి ఉండగా.. బాలాజీనగర్ ప్రాంతంలో పట్టుకొని తనిఖీ చేయగా.. పాజిటివ్‌గా నిర్ధారణ అయిందన్నారు. అతని వద్ద 4 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు వివరించారు.

గ్రామాల్లో సౌర వెలుగులు..!

- 'పీఎం సూర్యఘర్ మస్ట్ బిజిలీ యోజన'కింద ఎంపిక
- ఉమ్మడి జిల్లాలో రెండు మోడల్ గ్రామాలు
- పూర్తయిన సర్వే



వెంకట్రావ్‌పేటలో సర్వే చేస్తున్న అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: గ్రామీణ ప్రాంత ప్రజలకు నెలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం లక్ష్యంగా సోలార్ విద్యుత్ ప్లాంట్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి 'సూర్యఘర్ మస్ట్ బిజిలీ యోజన' పథకం కింద సంపూర్ణ సౌరశక్తి గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రతీ జిల్లాలో ఒక గ్రామాన్ని మోడల్ తీర్చిదిద్దనున్నారు. దీంతో ఆ గ్రామాల్లో సోలార్ వెలుగులు విరజిమ్మనున్నాయి. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం నర్సపూర్, మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట్ మండలం వెంకట్రావ్‌పేట్‌ను మోడల్ గ్రామాలుగా ఎంపిక చేశారు. కాగా ఆ గ్రామాల్లో ఎన్‌పీడీసీఎల్ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేశారు. ఎన్ని ఇండ్లు, విద్యుత్ సర్వీస్ మీటర్లు, వ్యవసాయ కనెక్షన్లు, తదితర వివరాలపై సర్వే చేపట్టారు. ఈ వివరాలను ప్రభుత్వానికి నివేదించి, తదుపరి ఆదేశాలు రాగానే పనులు ప్రారంభించనున్నట్లు జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ చెబుతున్నారు.

సంపూర్ణ సౌరశక్తి గ్రామాలుగా..

కేంద్ర ప్రభుత్వం, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ ద్వారా, రాష్ట్రంలో రెడ్‌కో విద్యుత్ పంపిణీ సంస్థలు ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. ప్రతీ జిల్లాకు ఒక గ్రామాన్ని ఎంపిక చేసి సంపూర్ణ సౌర విద్యుత్ గ్రామంగా తీర్చిదిద్దనున్నారు. సౌరశక్తి గ్రామంగా తీర్చిదిద్దేందుకు కేంద్రప్రభుత్వం రూ. కోటి సాయం అందిస్తుంది. స్థానిక ఉత్పత్తి చేయడం విద్యుత్ ఖర్చులు తగ్గనున్నాయి.

ఇంటి యజమానికి ఆదాయం..

రూఫ్ లెవల్ బిల్డింగ్‌పై కిలోవాట్ సోలార్ ఏర్పాటుకు 80 నుంచి 90 స్క్వేర్ ఫీట్లు, 2 కిలోవాట్స్ సోలార్ ప్లాట్ ఏర్పాటుకు 160 నుంచి 190 స్క్వేర్ ఫీట్లు, 3 కిలోవాట్స్ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు 270 స్క్వేర్ ఫీట్ల స్థలం అవసరం ఉంటుంది. వ్యవసాయ బోరుబావుల వద్ద 7.5 కిలోవాట్స్ ప్లాంట్ ఏర్పాటుకు బోరుబావుల నుంచి 100 మీటర్ల డీయషన్ పరిధిలో సరైన ప్రదేశం అవసరం ఉంటుంది. 2 కిలోవాట్స్ ప్లాంటు ఏర్పాటు అయితే ఇంటి యజమానికి నెలకు రూ. 2 వేల నుంచి రూ. 3 వేల ఆదాయం వరకు, బోరు బావుల వద్ద 7.5 కిలోవాట్స్ ప్లాంటుకు రూ. 5 వేల నుంచి రూ 6 వేల వరకు ఆదాయం యజమానికి చేరుతుంది. దీంతో పాటు రైతు గృహ అవసరాలకు విద్యుత్‌ను వినియోగించుకునే అవకాశం ఉంది.

ఎంపిక చేసిన గ్రామాల వివరాలు..

గ్రామం	విద్యుత్ కనెక్షన్లు	రిజిస్ట్రేషన్	వ్యవసాయ కనెక్షన్లు	రిజిస్ట్రేషన్
వెంకట్రావుపేట	1415	1405	346	340
నర్సపూర్	131	128	76	75

ఉమ్మడి జిల్లాలో రెండు గ్రామాలు..

సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సహించడం, సమాజం తమ ఇంధన అవసరాలకు తీర్చుకోవడంలో స్వావలంబన పొందేలా చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం మోడల్ సోలార్ విలేజ్ అనే పథకాన్ని అమలు చేస్తుంది. ఈ పథకం అమలుకు రాష్ట్రంలోని 17 జిల్లాలలో 8 గ్రామాలను ఎంపిక చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో ఉట్నూర్ డివిజన్ పరిధిలో నర్సపూర్, మంచిర్యాల జిల్లా పరిధిలో లక్షెట్టిపేట మండలం వెంకట్రావ్‌పేట్ గ్రామాలను ఎంపిక చేశారు. నర్సపూర్‌లో 131 విద్యుత్ మీటర్లకు 128ఇండ్లను అర్హతగా గుర్తించారు. వ్యవసాయ బోర్లు 75 నమోదు పూర్తి చేశారు. వెంకట్రావ్‌పేటలో 1415 విద్యుత్ మీటర్లకు 1405, 346 వ్యవసాయ బోరుబావుల కనెక్షన్లకు 340 నమోదు చేశారు. మొత్తం 1746 కనెక్షన్‌లు నమోదు చేశారు. ఇంటి యజమాని పేరు, బ్యాంకు ఖాతా నెంబర్, ఆధార్ నెంబర్, రూఫ్ లెవల్‌లో ఉన్న స్థలం వివరాలను సేకరించారు. ఎంత సామర్థ్యం కలిగిన ప్లాంట్ ఏర్పాటు చేయాలో వివరాలు సేకరించారు. ఆ వివరాలను సూర్యఘర్ పోర్టల్‌లో నమోదు చేశారు.

సర్వే పూర్తి చేశాం..



ప్రధాన మంత్రి సూర్యఘర్ మస్ట్ బిజిలీ యోజన పథకం ద్వారా సంపూర్ణ సౌరశక్తి గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు నిర్ణయించింది. మోడల్ గ్రామాల్లో సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటుకు చేసేందుకు సర్వే చేశాం. ఏడీఈ, ఏఈ, సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటి వివరాలు, యాజమాని పేరు, ఆధార్‌కార్డు వివరాలు సేకరించారు. రైతులకు సోలార్ ప్లాంట్ ప్రయోజనాలను వివరించాం.

– గంగాధర్, విద్యుత్‌శాఖ ఎస్ఈ, మంచిర్యాల

'కడెం'ను సందర్శించిన డ్యాం సేఫ్టీ బృందం



ప్రాజెక్టును పరిశీలిస్తున్న డ్యాం సేఫ్టీ బృందం

కడెం: కడెం ప్రాజెక్టును శుక్రవారం 'స్టేట్ డ్యాం సేఫ్టీ ఆర్గనైజేషన్' బృందం సభ్యులు రిటైర్డ్ సీఈ, హైడ్రో మెకానికల్ ఎక్స్‌పర్ట్ కె.సత్యనారాయణ, స్టేట్ డ్యాం సేఫ్టీ చీఫ్ ఇంజినీర్ ప్రమీల సందర్శించారు. ప్రాజెక్ట్ వరద గేట్లు, కౌంటర్ వెయిట్‌లు, లిఫ్టింగ్ రోప్‌లను పరిశీలించారు. వరద గేట్ల ఆపరేటింగ్ సమస్యలు, ప్రాజెక్ట్ స్థితిగతులను ఎస్ఈ రవీందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు చేశారు. ఇందులో ఈఈ విఠల్ రాథోడ్, డీఈ నవీన్, విజయలక్ష్మి, గణేశ్, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సీల్డ్ ఏజెన్సీ బృందం సందర్శన

నీటిపారుదల శాఖ కడెం ప్రాజెక్ట్ పూడికతీత టెండర్ల ప్రక్రియను ఈనెల 27న, పూర్తి చేసి, పనులను ఏజెన్సీకి అప్పగించారు. శుక్రవారం ఏజెన్సీ సిబ్బంది కడెం ప్రాజెక్టును సందర్శించి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. ఏజెన్సీ పేరు, వివరాలు కరీంనగర్ సీఈ పరిధిలో ఉంటాయని, టెండర్ గురించి తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని ఎస్ఈ రవీందర్ తెలిపారు.

సరిహద్దు ప్రాంతంలో విస్తృత తనిఖీలు



జాగిలంతో తనిఖీలు చేస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

కోటపల్లి: మండలంలోని రాపన్‌పల్లి అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద నార్కోటిక్ జాగిలంతో ఏసీపీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. అంతరాష్ట్ర చెక్‌పోస్టు మీదుగా తెలంగాణలోకి వచ్చిపోయే వాహనదారులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గంజాయి రహిత ప్రాంతంగా మార్చేందుకు వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సరిహద్దు ప్రాంతాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయడంతో పాటు మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. గంజాయి సేవించిన, రవాణ చేసిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, ఎస్సై రాజేందర్, ఎక్సైజ్ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నీలుగాయిని హతమార్చిన వేటగాళ్ల అరెస్టు

- నిందితుల్లో ఒకరు ప్రభుత్వ ఉపాధ్యాయుడు



అధికారుల అదుపులో వేటగాళ్లు

పెంచికల్‌పేట్: మండలంలోని లోడుపల్లి అటవీ ప్రాంతంలో నీలుగాయిని హతమార్చిన వేటగాళ్లను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పెంచికల్‌పేట్ రేంజ్ అధికారి అనిల్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లోడుపల్లి అటవీ ప్రాంతంలోని సహజ నీటి వనరుల వద్ద నీలుగాయిని హతమార్చానే పక్కా సమాచారంతో రావడంతో సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించాం. కొండపల్లి గ్రామానికి చెందిన చప్పిడే వెంకటేశ్, ఎల్లూర్ గ్రామానికి చెందిన దుర్గం రవీందర్‌ల ఇళ్లల్లో తనిఖీలు చేయగా.. నీలుగాయి మాంసం లభ్యమైంది. వారిని విచారించగా కొండపల్లి గ్రామానికి చెందిన ఆత్రం రవి, గొర్లపల్లి మొండి, మన్నెపల్లి శ్రీహరి, ఆత్రం భీమయ్యలతో కలిసి నీలుగాయిని హతమార్చినట్లు ఒప్పుకున్నారు. వెంకటేశ్, దుర్గం రవీందర్‌ను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు. దుర్గం రవీందర్ పెంచికల్‌పేట్ మండలంలోని మెరెగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. పరారీలో ఉన్న మిగతా నలుగురిని పట్టుకుంటామన్నారు. ఈ దాడుల్లో ఎఫ్ఎస్‌వో శంకర్, ఎఫ్‌బీవోలు సంగదీప్, సతీష్, లచ్చన్న, మనోహర్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి హత్యకు సుపారీ

ఇచ్చోడ: ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన భూతగాదాల్లో రాజేందర్ అనే వ్యక్తిని చంపేందుకు సుపారీ తీసుకున్న షేక్ సోహెల్‌ను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బజార్‌హత్నూర్ మండలంలోని గిర్నూర్ గ్రామానికి చెందిన గొల్లెన రాజేందర్, మేకల దేవేందర్ మధ్యలో గత కొద్ది రోజులుగా భూమి వివాదం నడుస్తోంది. అయితే మేకల దేవేందర్ ఈనెల 16న ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన షేక్ సోహెల్‌ను కలిసి గొల్లెన రాజేందర్‌ను హత్య చేసేందుకు రూ. 3 లక్షలకు ఒప్పందం చేసుకున్నాడు. అయితే ఈనెల 26న షేక్ సోహెల్ రాజేందర్‌ను ఇచ్చోడ మండల కేంద్రంలో కలిసి నిన్ను హత్య చేసేందుకు దేవేందర్ సుపారీ ఇచ్చాడని, నువ్వు డబ్బులు ఇస్తే హత్య చేయకుండా వదిలేస్తానని బెదిరించాడు. భయాందోళన చెందిన రాజేందర్ సోహెల్‌కు ఫోన్‌పే ద్వారా రూ. 2 వేలు చెల్లించాడు. మరింత డబ్బు ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు షేక్ సోహెల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుళ్లిన మాంసం.. కాలం చెల్లిన స్వీట్లు

- బల్దియా అధికారుల తనిఖీల్లో గుర్తింపు




స్వీట్లను పరిశీలిస్తున్న అధికారులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ బల్దియా పారిశుద్ధ్య విభాగం అధికారులు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు హోటల్స్, స్వీట్ షాపుల్లో తనిఖీలు చేపట్టారు. కలెక్టర్‌చౌక్‌లోని ఓ హోటల్‌ను తనిఖీ చేసిన అధికారులు కుళ్లిన 6 కిలోల మాంసం, గడ్డ కట్టిన పాడైన చేపలను గుర్తించారు. వాటిని నిల్వ ఉంచిన ఫ్రిజ్‌లో పురుగులు ఉండటంతో హోటల్ యాజమానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కుళ్లిన మాంసతో పాటు ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. హోటల్ నిర్వాహకుడిని హెచ్చరించి, జరిమానా విధించారు. అనంతరం వినాయక్ చౌక్‌లోని వెంకటేశ్వర స్వీట్‌షాపు, స్వీట్ల తయారీ ప్రాంతం అపరిశుభ్రంగా ఉండటాన్ని గుర్తించారు. కాలం చెల్లిన స్వీట్లను తయారు చేసిన స్వీట్లతో కలిపి విక్రయిస్తున్నట్లు గుర్తించి, జరిమానా విధించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడితే చర్యలు తప్పవని ఫుడ్ ఇన్స్పెక్టర్లు ఎం.నరేందర్, బైరి శంకర్‌లు హెచ్చరించారు.

మందుబాబుల వీరంగం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని చున్నంబట్టి బార్‌లో గురువారం రాత్రి రెండువర్గాలు దాడి చేసుకున్న ఘటన సంచలనం సృష్టించింది. వివరాల్లోకి వెళితే.. సీసీసీ నస్పూర్ మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన దెబ్బెటి శ్రీనివాస్ తన స్నేహితులు మల్లేష్, అశోక్‌లు కలిసి ఏలైట్ బార్‌లో మద్యం తాగుతున్నారు. అక్కడే మరో ముగ్గురు బాడిసే రమేశ్, అయితే మహేశ్, ప్రశాంత్‌లు తాగుతున్నారు. రమేశ్, శ్రీనివాస్ స్నేహితులు కావడంతో వారు మాట్లాడుతుండగా.. మహేశ్ అనే వ్యక్తి వచ్చి రమేశ్‌ను నిల్చోబెట్టి మాట్లాడుతావ అంటూ.. శ్రీనివాస్‌తో గొడవకు దిగాడు. శ్రీనివాస్ తన తమ్ముడు శ్రీకాంత్‌కు ఫోన్ చేయడంతో అతను వచ్చి మహేశ్‌ను మందలించాడు. దీంతో శ్రీకాంత్‌పై మహేశ్, ప్రశాంత్ బీరు బాటిల్‌తో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషయమై సీఐ ప్రమోద్‌రావును వివరణ కోరగా దెబ్బటి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహేశ్, ప్రశాంత్‌లపై కేసు నమోదు చేశామన్నారు.

ఇసుక అక్రమ రవాణపై కొరడా



సీజ్ చేసిన ట్రాక్టర్లు

జన్నారం: ఇసుక అక్రమ రవాణ చేస్తున్న వారిపై అటవీశాఖ అధికారులు కొరడా ఝులిపించారు. టైగర్‌జోన్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఇందన్‌పల్లి రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. రేంజ్ పరిధిలోని బుట్టాపూర్ వాగులో నుంచి ఇసుక తోడుతున్నట్లు పక్కా సమాచారం రావడంతో దాడులు నిర్వహించారు. బుట్టపూర్‌కు చెందిన తిప్పని విశ్వాస్, జన్నారంకు చెందిన దాసిరి అన్వేష్, కలమడుగుకు చెందిన పిండి ముజ్జన్నలకు చెందిన ట్రాక్టర్లను సీజ్ చేసి రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. అదే విధంగా మొర్రిగూడ ప్రాంతంలో తనిఖీ చేయగా మరో ట్రాక్టర్ ఇసుకతో వస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఇసుక తవ్వడం, తరలించడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇద్దరు కార్మికులకు గాయాలు

నస్పూర్: పట్టణ పరిధిలోని శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు సింగరేణి కార్మికులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్కే న్యూ టెక్ గనిలో విధులు నిర్వహిస్తున్న సీసీసీలో నివాసం ఉండే గట్టురాజు, బెల్లంపల్లిలో నివాసం ఉండే చీకటి జనార్దన్ శుక్రవారం విధులు ముగించుకుని బైక్‌పై శ్రీరాంపూర్ వైపు వెళ్తుండగా.. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం సమీపంలో వ్యాను ఢీకొట్టింది. ప్రమాదంలో కార్మికులు ఇద్దరు గాయపడ్డారు. వారిని స్థానికులు 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

ఆన్‌లైన్ ప్రవేశాలు జరిగేనా..?

- ఇంటర్ విద్యలో అమలుపై స్పష్టత కరువు
- మాన్యువల్‌గానే ప్రవేశాలు
- విద్యార్థులపై ప్రైవేట్ యాజమాన్యాల ఒత్తిడి



బోథ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

బోథ్: డిగ్రీలో అమలు చేస్తున్న దోస్త్ విధానం తరహాలోనే ఇంటర్ ప్రవేశాలపై పీటముడి నెలకొంది. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానం వచ్చినా.. మాన్యువల్ గానే ప్రవేశాలు పొందుతున్నారు. ప్రైవేటు యాజమాన్యాలు తమ కళాశాలల్లో చేరాలని విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నారు. ఫలితంగా విద్యార్థుల్లో అయోమయం నెలకొంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రైవేట్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థుల ప్రవేశాలపై స్పష్టత కరువైంది.

ప్రైవేట్ కళాశాలల ఆగడాలను చెక్..

ఇంటర్ ప్రవేశాల్లో దోస్త్ తరహా ఆన్‌లైన్ విధానం అమలైతే విద్యార్థులకు మేలు జరుగుతుంది. విద్యార్థి తనకు నచ్చిన కళాశాలలను ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేసుకునే వీలుంటుంది. పదో తరగతిలో విద్యార్థికి వచ్చిన మార్కులు, రిజర్వేషన్ల ఆధారంగా కేటాయింపులు జరుగుతాయి. ఈ విధానంతో విద్యార్థి తనకు నచ్చిన కళాశాలలో చదివే వీలు ఉంటుంది. వివిధ ఫేజ్‌లతో కూడిన ప్రవేశాలు ఉంటే విద్యార్థులు నష్టపోయే అవకాశం ఉండదు. ఇంటర్‌లో కూడా డిగ్రీ మాదిరిగానే ఆన్‌లైన్ ప్రవేశాలు చేపడితే ప్రైవేట్ కళాశాలల ఆగడాలను చెక్ పడనుంది.

విద్యార్థుల వద్దకు పీఆర్‌వోలు..

పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఇంటర్‌లో ప్రవేశాలు పొందేందుకు ప్రాధాన్యం ఇస్తుంటారు. ఈక్రమంలో ప్రైవేట్ యాజమాన్యం క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం చేపడుతున్నారు. ఇప్పటికే ఎండను సైతం లెక్క చేయకుండా ప్రతీ గ్రామాన్ని సందర్శిస్తున్నారు. తల్లిదండ్రులను కలిసి తమ కళాశాలల్లో చేరాలని కోరుతున్నారు. విద్యార్థులు ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాస్తున్నారు. కాగా ఆయా కార్పొరేట్ కళాశాలలకు చెందిన పీఆర్‌వోలు విద్యార్థులతో మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నారు. వారిని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.


కళాశాలల వివరాలు (ప్రభుత్వ, ప్రైవేట్)

ఆదిలాబాద్	76
నిర్మల్	63
మంచిర్యాల	62
కుమురం భీం ఆసిఫాబాద్	48

మొదట చేరి.. తరువాత తిరిగి వచ్చి..

పదో తరగతి పరీక్షలను విద్యార్థులు రాయకముందే పలు ప్రైవేట్ కళాశాలలకు చెందిన పీఆర్‌వోలు విద్యార్థుల అడ్మిషన్లు తీసుకుంటున్నారు. తల్లిదండ్రులను కలిసి తమ కళాశాల గురించి వివరించి అడ్మిషన్లు చేస్తున్నారు. అడ్మిషన్ల సమయంలోనే వేలల్లోనే ఫీజులు కట్టించుకుంటున్నారు. ఇక పదో తరగతి పాస్ కాగానే విద్యార్థి కనీసం నెల రోజులు కూడా కళాశాలలో ఉండకుండా ఇంటికి వచ్చేస్తున్నారు. తాము కట్టిన ఫీజు వాపసు ఇవ్వకుండా కళాశాలల యాజమాన్యాలు తల్లిదండ్రులను తిప్పించుకుంటున్నాయి. దీంతో తల్లిదండ్రులు నష్టపోతున్నారు. డిగ్రీ మాదిరిగా ఇంటర్‌లో ఆన్‌లైన్ ప్రవేశాలు చేపడితే ఇలాంటి నష్టాలు జరిగే అవకాశం ఉండదు. చెల్లించే ఫీజు వివరాలు కూడా ఆన్‌లైన్ అడ్మిషన్‌లో కనిపిస్తాయి. దీంతో ఎక్కువ ఫీజును కట్టే అవకాశం కూడా ఉండదు.

ఆన్‌లైన్ ద్వారా చేపట్టాలి



ఇంటర్ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్‌లో నిర్వహించాలి. డిగ్రీ మాదిరిగా ప్రవేశాలు నిర్వహిస్తే విద్యార్థులు తమకు నచ్చిన కళాశాలలను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది. కార్పొరేట్ కళాశాలలకు చెందిన పీఆర్‌ఓలు గ్రామాల్లోకి వచ్చి అడ్మిషన్లు తీసుకుంటున్నారు. దీంతో విద్యార్థుల నుండి అధిక ఫీజులు అడ్మిషన్ల సమయంలో వసూలు చేస్తున్నారు. దీంతో విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఆన్‌లైన్‌లో ప్రవేశాలు జరిపితే విద్యార్థి మంచి కళాశాలలో చదివే అవకాశం ఉంటుంది.

– బోయిడి ఆకాష్, ఏబీవీపీ నాయకుడు

ఎలాంటి నోటిఫికేషన్ రాలేదు

గతంలో ఇంటర్‌లో ఆన్‌లైన్‌లో ప్రవేశాల కోసం విద్యార్థి కళాశాలకు దరఖాస్తు చేసుకునే వీలుంది. విద్యార్థి కళాశాలలో అడ్మిషన్ తీసుకోవాలంటే కళాశాల లాగిన్‌లో వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. లేదా విద్యార్థి తాను స్వయంగా ఆన్‌లైన్ ద్వారా వివరాలను నమోదు చేసుకుని కళాశాలలో చేరే అవకాశం ఉంది. కాని డిగ్రీ తరహా దోస్త్ మాదిరి ఆన్‌లైన్ ప్రవేశాలు ఇంటర్‌లో లేవు. ప్రభుత్వం నుంచి ఎలాంటి నోటిఫికేషన్, సమాచారం లేదు.

– గణేశ్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, ఆదిలాబాద్

రౌడీయిజాన్ని ఉక్కుపాదంతో అణచివేస్తాం

- డీఎస్పీ జీవన్‌రెడ్డి
- వ్యక్తిపై దాడి చేసి కిడ్నాప్
- 9 మందిపై కేసు.. ఆరుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ సబ్ డివిజనల్ పరిధిలో రౌడీయిజాన్ని ఉక్కుపాదంతో అణచివేస్తామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి అన్నారు. రౌడీయిజం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జనవరి 8న ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బంగారుగూడకు చెందిన సయ్యద్ జాహిర్‌పై పలువురు దాడి చేసి, కిడ్నాప్ చేయడం జరిగిందన్నారు. ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించడంతో భయపడి ఎవరికీ చెప్పలేదు. ఈనెల 26న ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. విచారణ చేపట్టగా షేక్ ఇజాజ్, షేక్ సలీంతో పాటు మరో ఏడుగురు ఇంటిలో బంధించి కొటి, సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. ఈ వీడియోల ఆధారంగా వారిపై కేసులు నమోదు చేశామన్నారు. దాడి చేసిన బంగారుగూడకు చెందిన షేక్ ఇజాజ్, షేక్ రోషన్, షేక్ ముజీబ్, ఖానాపూర్‌కు చెందిన హసీబుల్లా, సయ్యద్ జుబేర్, మహాలక్ష్మివాడకు చెందిన అమర్, షేక్ సోహెల్‌లను అరెస్టు చేయగా.. రాహేల్, షేక్ సలీంలు పరారీలో ఉన్నారు. వారి వద్ద నుంచి మూడు ఆటోలు, మూడు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్నవారిని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. సమావేశంలో సీఐ ఫణిధర్, ఎస్సై ముజాహిద్, సిబ్బంది పాల్గొన్నారు.